క్లుప్తంగా

చేయూత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన జుంగ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం స్థానిక ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, శాయంపేట ఎంపీటీసీ జమున సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.క్వింటా బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు మారపల్లి మోహన్, దైనంపల్లి కరణ్‌బాబు, పాపయ్య, రాజయ్య, కార్తీక్,కర్ణాకర్, మచ్చయ్య, సాయి, అరవింద్, రాజేందర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్కతుర్తి: మండలంలోని పెంచికలపేట వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. మండ రంజీత్ కల్లుపల్లె వాగు నుంచి ఎల్కతుర్తి వైపు అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హనుమాన్ శోభాయాత్ర



ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో మాలధారులు హనుమాన్ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 8 గంటల నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో అర్ధరాత్రి వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు శోభాయాత్రకు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో గురు స్వామి బొల్లెడ్ల తిరుమల్‌రెడ్డి, ఆమంచ సాయిప్రశాంత్, చిర్ర మహేష్, నారాయణగిరి భరత్, గడ్డం రాజు, బొమ్మకల్ల నాగరాజు, హనుమాన్ మాలధారులు, తదితరులు పాల్గొన్నారు.

14న హనుమాన్ పూజలు

ఆత్మకూరు : ఈ నెల 14న మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలోని హనుమాన్ మందిరంలో టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జిల్లా ధార్మిక మండలి సభ్యుడు నాగబండి శివప్రసాద్, అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ఎల్కతుర్తి: స్థానిక బస్టాండ్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. మృతుని వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలలోపు ఉన్నట్లు వెల్లడించారు. ముఖంపై తెల్లని గడ్డం, నల్లని తలవెంట్రుకలు, నీలిరంగు ఫుల్‌టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని పక్కకు బట్టల మూట ఉంది. బస్టాండ్‌లో మృతి చెంది ఉండడాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని హుజురాబాద్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషను సంప్రదించాలని కోరారు.

మొరం దందా



దామెర: మండలంలోని కోగిల్వాయి సమీపంలోని చంద్రగిరి గుట్టల సమీపంలో మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా గ్రామానికి చెందిన కొంతమంది గుట్టల సమీపంలోని భూమిలో రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల సాయంతో నగరంలోని వెంచర్లకు తరలిస్తున్నారు. రాత్రయితే చాలు అక్రమార్కులకు అడ్డులేకుండా పోతుందని పలువురు విమర్శిస్తున్నారు. మొరం తవ్వకాలు జరిగినప్పుడు మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ అక్రమ వ్యాపారం ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. ఇంత జరిగినా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్‌ను వివరణ కోరగా తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

‘పది’లో సత్తా చాటిన విద్యార్థులు



ఎస్.మాధవన్



దుండ్ర తరుణ్



సంజన



అక్షిత్



హషింగ్



రిషిత

కమలాపూర్: రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిన పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. గతేడాదితో పోలిస్తే కమలాపూర్ మండలం పాఠశాలల్లో చదివిన పేద విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి ఉత్తీర్ణత శాతం తగ్గింది. స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.మాధవన్ 10/10 జీపీఏ సాధించాడు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన దుండ్ర తరుణ్ 9.8 జీపీఏ, బాలికల పాఠశాలకు చెందిన పి.సంజన 9.7 జీపీఏ సాధించింది. శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. కమలాపూర్: మండలంలోని 17 ప్రభుత్వ పాఠశాలల్లో భీంపల్లి, మాదన్నపేట, ఉప్పల్ (బాలురు) పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు లేకపోగా మిగిలిన 14 పాఠశాలలకు చెందిన 540 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 73.33 శాతంతో 396 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రాంకిషన్‌రాజు తెలిపారు.

పరకాల: స్థానిక సోషల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఫలితాలతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మండలంలోని నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. టీఎస్‌డబ్ల్యూఈఐఆర్ఎస్ (బాలుర) 70 మంది విద్యార్థులకు 70 మంది ఉత్తీర్ణత సాధించగా వారిలో ఎస్.రమకాంత్ 10 జీపీఏ సాధించాడు.(బాలికల)77 మంది విద్యార్థినిలకు 77 మంది ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీహెచ్ఎస్(బాలికల) 49 విద్యార్థినులకు 45 మంది విద్యార్థుల ఉత్తీర్ణత 91.84 శాతం ఫలితాలు సాధించగా నాగారం జెడ్పీహెచ్ఎస్ 14 మంది విద్యార్థులకు 11 మంది ఉత్తీర్ణతతో 78.57 ఫలితాలు సాధించారు. వెల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నలుగురు విద్యార్థులకు ముగ్గురు ఉత్తీర్ణత సాధించడంతో 75శాతం ఫలితాలు సాధించారు. పరకాల జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో 16 మందికి 13 మంది ఉత్తీర్ణత 81.25 శాతం ఫలితాలు సాధించారు.

ఎల్కతుర్తి : మోడల్ పాఠశాలలో 100కు 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో హరీష్ 9.3, గణేష్‌యాదవ్ 9.2, అమూల్య 9.2 ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బయ్యా సునీత తెలిపారు. సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అమరగొండ రిషిత 9.8 జీపీఏ, బీ.హషింగ్ 9.7 జీపీఏ సాధించగా పాఠశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు చెందిన బాలురు మొత్తం 140 మందికి 114 మంది, బాలికలు 228 మందికి 212 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఈసారి రవీందర్ తెలిపారు.

శాయంపేట : మహత్మజ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు 38 మంది పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. యశ్వంత్ 10/10 జీపీఏ సాధించాడు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక అల్లం అక్షిత్ 9.2 జీపీఏ సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు 79 మంది హాజరు 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. శ్రీ అను, అక్షయ 9.8 జీపీఏ సాధించారన్నారు.

ఐనవోలు: మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీ బీవీ, ఎంజేపీ, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలల్లో 353 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 336 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వేంకటేశ్వర్ రావు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్, సింగారం, కక్కిరాలపల్లి, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్, ఎంజేపీతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. కేజీబీవిలో చదివిన జీస్ఫూర్తి 10/10 జీపీఏ సాధించగా కేజీబీవీ పి.నిశిత, ఏంజేపీ చక్రిధర్, ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్ జీ.దీప్తి, పి.అశ్వితలు 9.8 జీపీఏ సాధించారు. అదే విధంగా పాత్‌ఫైండర్ విద్యార్థులు సానియా, సాయి 10 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

త్వరలో కళాశాల భవనానికి నిధులు మంజూరు

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నవీన్ మిట్టల్‌ను కలిసిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : త్వరలోనే పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కానున్నట్లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, సిబ్బందితో కలిసి కాలేజియేట్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అండ్ లాండ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ను హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో కలిశారు. పరకాల పట్టణంలో డిగ్రీ కళాశాలకు రెండున్నర ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు అందజేసి వారిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై కమిషనర్ నవీన్‌మిట్టల్ సానుకూలంగా స్పందించి త్వరలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

15 నుంచి సీఎం కప్ క్రీడలు



ఎల్కతుర్తి : వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీఓ సునీత

ఎల్కతుర్తి: ఈనెల 15 నుంచి 17 వరకు మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించే సీఎం కప్ క్రీడల్లో అర్హత కలిగిన వారు పాల్గొని క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ తూర్పాటి సునీత బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. క్రీడలు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఒక్కొక్క గ్రామం నుంచి ఒక్క జట్టు పాల్గొనాలని సూచించారు. తమ పేర్లతో పాటు ధృవీకరణ పత్రం జిరాక్స్ పీఈటీ బాలమురళీకృష్ణకు అందించాలని కోరారు. మొదటి రోజు ఖోఖో, రెండో రోజు కబడ్డీ, మూడో రోజు వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మేకల స్వప్న, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈఓ రవీందర్, పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి 17వరకు నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ జక్కుల అనీత అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ భాస్కర్, జెడ్పీటీసీ వంగ రవీందర్, పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే వా రు ఆయా గ్రామ పంచాయతీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్సై ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం



ధర్మసాగర్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్ : తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ము ప్పారంలో బుధవారం ఆయన తటాక అభయాంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా రు. అనంతరం నారాయణగిరిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్నలు క్వింటాలుకు రూ.1962 మద్దతు ధరతో రైతుల నుంచి కొనుగోలు చేయడానికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మల్లక్‌పల్లి సర్పంచ్ మునిగెల రాజు, సర్పంచ్‌లు సమ్మక్క రాజయ్య, ఏఓ పద్మ, ఏఈఓ నవ్య ఎంపీటీసీ శ్రీనివాస్, పాల్గొన్నారు.

దామెర: ప్రతి ధాన్యం గింజను కొంటామని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఓడీసీఎంఎస్, సింగరాజుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, దళిత బంధు చైర్మన్ గరిగె క్రిష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, డైరెక్టర్లు పొడాల మధూకర్, లనిల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ తడక రాణి, జెడ్పీటీసీ లాండిగె కల్యాణి, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్ కట్కూరి విజయలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ రైతులు తాము పండించిన మొక్కజొన్నలను నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు మొటం రమేష్‌బాబు, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, సీఈఓ ఎండీ.చోటేమియా, పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సర్పంచ్ బొట్ల సంధ్య రవి ప్రారంభించారు. ఉపసర్పంచ్ బెజ్జంకి రఘునాచారి పాల్గొన్నారు.

ఆత్మకూరు : సొసైటీ పరిధిలోని రైతులు తేమ లేకుండా ధాన్యంను తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడర్ సూచించారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ యన ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రే వూరి జైపాల్‌రెడ్డి, రాజేందర్, నోడల్ అధికారి సోమశేఖర్, సీఈఓ ఓం ప్రకాష్, శ్యామ్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో..



కమలాపూర్‌లో...



దామెరలో...



నడికూడలో..

కనీస వసతులు కల్పించాలి



కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

నడికూడ : ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కనీస వసతులు కల్పించాలని వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపెల్లి మల్లేశం అన్నారు. బుధవారం మండలంలోని కంఠాత్మకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యంను సందర్శించి పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకొని నిరసన తెలిపి అనంతరం మీడియాతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైయస్సార్‌టీపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మారాంరెడ్డి కొటిల్, నాగవెళ్లి రజినీకాంత్, జలుగురి రమేష్, దండు సుధాకర్, మహేందర్, కృష్ణస్వామి, చుక్క రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



బావుపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ వసంతలక్ష్మి

ఎల్కతుర్తి : మండలంలోని బావుపేటలో కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లయ్ డీఎస్ఓ వసంతలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. రైతుల పాస్‌పుస్తకాలను ఎంటర్ చేసిన నాలుగు రోజుల్లో వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడుప శేషగిరి, నోడల్ ఆఫీసర్ మనోహర్, ఏఈఓ, సీఈఓ తిరుపతి ఉన్నారు.

రసూల్‌పల్లిలో ‘కంటి వెలుగు’ ప్రారంభం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని రసూల్‌పల్లిలో బుధవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ కనెబోయిన కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధత్వ రహిత సమాజ స్థాపన కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైదులు వైద్యపరీక్షలు నిర్వహించి కళ్ల జోడులను అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని మొక్కజొన్న పంట దగ్ధం



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం శివారులోని మొక్కజొన్న పంట క్షేత్రంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని నాలుగున్నర ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు రైతులు నీల సురేందర్‌రెడ్డి, పెంబర్తి కుమార్ తెలిపారు. బాధిత రైతుల కథనం ప్రకారం..మొక్కజొన్న పంట చేతికి రావడంతో బుధవారం పంటను పంటకోత మిషన్ సాయంతో కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకుంది. అక్కడే ఉన్న రైతులు మంటలను చల్లార్చే ప్రయత్నం చేసినప్పటికి మంటలు అదుపులోకి రాలేదు. పరకాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వాహనం వచ్చినప్పటికి బురదలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో సురేందర్‌రెడ్డికి చెందిన మూడు ఎకరాలు, కుమార్‌కు చెందిన ఎకరం 20 గుంటలో పండించిన పంట, మాడ విజేందర్‌కు చెందిన డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి అహ్మద్ రాజా, ఉపసర్పంచ్ సుమన్ సందర్శించి పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఏఈఓ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



సాయిచందర్ (ఫైల్)

ఐనవోలు: చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వల చుట్టుకుపోయి చెరువులో పడి మృతిచెందిన సంఘటన మండలంలోని పంథిని శివారు కడారి చెరువులో చోటుచేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. ముదిరాజ్ కులానికి ఉప్పరి సాయిబాబు అలియాస్ సాయిచందర్(38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కులవృత్తిలో భాగంగా అప్పుడప్పుడు చేపలు పడుతుండేవాడు. బుధవారం చేపలు పట్టడానికి కడారి చెరువు వద్దకు తీసుకుని వెళ్లాడు. చెరువులోకి వల విసిరి లాగే క్రమంలో కాలుకు వల చుట్టుకోవడంతో ఎటూ కదలలేక నీట మునిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు పంపించారు. మృతుడికి భార్య తిరుమల, కూతురు చందన, కుమారుడు ధనుష్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.